# మన్యముకొండ క్షేత్ర మహోత్యం

## "ఓం నమో: వేంకటేశాయ"

ప్రకృతి సిద్ధమైన కొండలపై గల గుహలో మునీశ్వరులు లోకకళ్యాణార్థమై తపస్సు చేయుచుండగా భక్తులను గ్రహించడానికి ఈ యుగారంభంలో కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారు ఆదిశేషావతార రూపంలో గల రాతిగుహలో స్వయంవ్యక్తమై వెలసియున్నారు. మునీశ్వరులు, సిద్ధపురుషులు తపస్సు చేయడం వలన మునులకొండగా, కాలక్రమేణా మన్యముకొండగా వాడుకలోని వచ్చినదని చరిత్ర ఆధారంగా తెలయుచున్నది. సిద్ధపరుషుడైన శ్రీ అళహరి కేశవయ్య గారు కర్ణాటక రాష్ట్రంలోని శ్రీరంగం నుండి విచ్చేయు సందర్భమున, రాత్రి సమయంలో తుంగభద్ర నది తీరములో విశ్రాంతి కొరకు నిద్రించుచుండగా, స్వప్నములో శ్రీనివాసుడు దర్శనమిచ్చి మన్యముకొండ గుహలో వెలసియున్న శ్రీనివాసుడికి నిత్యసేవలు చేయాలని ఆజ్ఞాపించియున్నారని, వేకువజామున వెంటనే మేల్కొని, తుంగభద్రనదిలో స్నానమాచరించి సూర్యనమస్కారము చేసుకొని, అర్ఘ్యము వదలుచుండగా "శ్రీ వేంకటేశ్వరస్వామివారి శిలా ప్రతిమ" వారిచేతిలోనికి రాగా, స్వప్నసాక్షాత్కార ఆనతిగా భావించి, మన్యముకొండలో గల గుహలో ప్రతిష్ఠించియున్నారని, నాటినుండి శ్రీ స్వామివారి ఆదేశముల మేరకు నాటినుండి అళహరి వంశీయులు 15 తరాలుగా, (ఆరు శతాబ్దముల) నుండి శ్రీ స్వామివారి సన్నిధిలో నిత్యసేవలు చేయుచున్నారు. ఈ కొండపై దక్షిణాభిముఖంగా "శివలింగం" కలదు. భక్తులు దక్షిణలింగేశ్వరుడిగా భావించి కొలుచుచున్నారు. మన్యముకొండపై శివకేశవులకు భేదము లేదనే విషయము గోచరమగుచున్నది.

శ్రీమద్ అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకులైన కలియుగ దైవముగా కొలిచెడి వారికి కొంగుబంగారమై **1. ఉలిముట్టని స్వామి, 2. చెయ్యని పాదములు, 3. కట్టనిగుడి, 4. తవ్వని కోనేరు**గా వినుతికెక్కి శ్రీ నర్సింహ్మ యోగి, శ్రీ ఎత్తేపు రామయోగి, శ్రీ కాశీరాయలు, శ్రీ వీరయప్ప మున్నగు తపస్సంపన్నులైన భాగవతోత్తములతో కొలువబడి తరించియున్నారు. "తీరితే తిరుపతి తీరకుంటే మన్యముకొండ". కలియుగ వైకుంఠముగా తిరుపతి తర్వాత తెలంగాణ తిరుపతిగా పిలువబడుచున్నదీ క్షేత్రము. 1976 సం॥నకు పూర్వము కొండపైకి మెట్ల మార్గం మాత్రమే ఉండేది. అళహరి రామయ్య గారి విశేష కృషితో ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఘాట్‌రోడ్డు నిర్మాణం మరియు దాతల ఆర్థిక సహాయంతో యాత్రికుల వసతికై ధర్మశాలలు నిర్మించియున్నారు. తదుపరి 1983 సం॥ నుండి దేవాదాయ శాఖ పరిధిలోని తేబడి, కార్యనిర్వహణాధికారి గారిచే పరిపాలన వ్యవహారములు నిర్వహించబడుచున్నవి. శ్రీ మన్యముకొండవాసుని దివ్యచరణాల చెంత నిత్యకీర్తనలచే భక్తిలాలనలో మునిచెత్తిన ప్రముఖ వాగ్గేయకారులైన శ్రీ హనుమద్దాసులవారి మంగళశాసనములతో, మాఘశుద్ధ దశమి నుండి మాఘబహుళ విదియ వరకు (ఫిబ్రవరి) శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవములు పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారంగా జరుపబడుచున్నవి. శ్రీ స్వామివారి ఆనతి మేరకు 1958 సం॥లో అళహరి రామయ్య గారు కొండ దిగువన "శ్రీ అలివేలుమంగతాయారు" అమ్మవారి ఆలయాన్ని నిర్మించియున్నారు. ఫాల్గుణ శుద్ధ త్రయోదశి నుండి పాల్గుణ బహుళ విదియ వరకు (మార్చ్) శ్రీ అలివేలుమంగతాయారు అమ్మవారి ఉత్సవములు ఘనంగా నిర్వహించబడుచున్నవి.

ఈ క్షేత్రము మహబూబ్‌నగర్ నుండి రాయిచూర్ మార్గంలో 18 కి.మీ.లో మరియు హైదరాబాద్ నుండి 120 కి.మీ.లో దూరంలో కలదు.

**ప్రతి పౌర్ణమి రోజున ఉదయం 10 గం॥లకు నిర్వహించబడు శ్రీ స్వామివారి కళ్యాణములో పాల్గొని తరించగలరు.**

**శాశ్వతపూజ మరియు అన్నదాన పథకములలో సభ్యులుగా చేరి ఆయురారోగ్యాలతో, సౌభాగ్యవంతులుగా ఉండాలని శ్రీ స్వామివారిని కోరుచున్నాము.**

శ్రీ స్వామివారి సేవలో **శ్రీ అళహరి నారాయణస్వామి,** బి.ఎ., వ్యవస్థాపక ధర్మకర్త & చైర్మన్

**శ్రీ స్వామివారికి సమర్పించు ప్రతి రూపాయి ఆలయ నిర్వహణ, అభివృద్ధికి వినియోగించబడుతుంది.**